# గాంధీబొమ్మసాక్షిగా..!

'శైడిపాల'

ఈ దేశంలో ఓ రాజకీయ నాయకుడు నెగ్గినందుకో ఓడినందుకో, హత్య చేసినందుకో చెయ్యబడినందుకో పదవి యెక్కినందుకో ఎక్కనరిదుకో, ఇలా సవాలక్ష కారణాలకు సమ్మెలు బంద్‌లు జరుగుతుంటాయి. జరిగి గాంధిగార్ని గుర్తు చేస్తుంటాయి. అలాగే ఆ రోజు కూడా బంద్ జరుగుతోంది. అంతకుముందు రోజు కూడా బందే!

అది పల్లె పట్టణం కాని వూరు. వచ్చీరాని వయసులో వున్న ఆడపిల్ల ఎబ్బెట్టుగా పైటేసుకొన్నట్టు -అది నాగరికత అవునో కాదో తెలియని స్థితిలో వుందా వూరు. ఆ రోడ్ల మీద కార్లూ బళ్లూ సమంగా తిరుగుతుంటాయి. ఆబోతులతో పాటు గాలి రౌడీలు కూడా స్వేచ్ఛా విహారం చేస్తుంటారు. గిరి గీసుకున్న ముఠాల స్థావరాల్లా వీధులన్నీ యిరుకుగా మురికిగా వుంటాయి. వాహనాల కింద కుక్కలు పడి చచ్చినంత తేలిగ్గా అక్కడ పట్టపగలే హత్యలు జరుగుతుంటాయి.

ఆ రోజు పూర్తిగా బంద్ జరుగుతుందని ముందే ప్రకటించారు. అన్నట్టుగానే మెడికల్ షాపులూ, తినుబండారాల దుకాణాలు, మిల్స్ హోటల్స్‌తో సహా - అన్నీ మూసేసారు. కాదు మూయించారు. సెంటరులో బ్రాందీ షాపు మాత్రం తెరిచి వుంచారు. ఆ మధ్యాహ్నం ట్రాక్టర్లతో గొప్ప ఊరేగింపు జరిగింది. నాలుగు రోడ్ల కూడలిలో తగలేస్తున్న గడ్డి బొమ్మలు యింకా రావణకాష్ఠంలా కాలుతూనే వున్నాయి

గాంధీ బొమ్మ సెంటర్లో బంద్ నిర్వహిస్తున్న దళానికి నాయకుడు శివుడు. ముప్పయ్యేళ్ల శివుడి పేరు చెపితే ఊరంతా హడలే అతను రాజకీయ నాయకుడు కాని, కాబోయే నాయకుడు కాని కాదు. రాజకీయ నాయకుల చేతుల్లో పావు -మెడలో పాము. అతను తలచుకొంటే పగటిపూట భర్తతో కలిసి వెళ్లే పడుచును నిలేసి మానభంగం చెయ్యగలడని ప్రతీతి. మందు కొడితేనే అతను మృగంలా మారిపోతాడని, అందుకే శివుణ్ణి వాళ్ల బాస్ ఎప్పుడూ మందులో స్నానం చేయిస్తుంటాడని ప్రజావాక్యం.

వాళ్ల బాస్ పేరేదయితేనేం ఈ దేశంలోని రాజకీయ నాయకుల్లో ఆయనొకడు. బాస్ ఆదేశం మేరకు శివుడు స్ట్రిక్టుగా బంద్ అములు జరిపిస్తూ తన శిష్య బృందంతో చిందులు తొక్కుతున్నాడు. షాపులు మూసేసి ముందు కూర్చున్న యజమానులను, మధ్యాహ్నం పూట బంద్ అంత తేలికగా వుండదని సగం సగం షట్టర్స్ తెరిచిన వాళ్లనీ శివుడు కఠినంగా హెచ్చరిస్తున్నాడు. ఏ మూల ఏ కిళ్లీబడ్డీ తెరిచినా, ఏ అరుగుమీద ఏ చిన్న కిరాణా దుకాణం తెరిచినా - కనిపెట్టి ప్రతాపం ప్రదర్శించి వస్తున్న అనుయాయుల్ని అభినందిస్తున్నాడు.

"గురూ, మాధవి కాన్వెంటు క్లోజ్ చెయ్యలేదు. ప్రిన్సిపాల్‌తో చెపితే పిల్లలకు స్ట్రయిక్ ఏమిటని గిరగా సమాధానం చెప్పింది." గుండెలు కనిపించేలా షర్ట్‌కి పై నాలుగు గుండీలు విప్పేసిన కుర్రాడు హడావిడిగా సైకిలు దిగుతూనే చెప్పాడు.

"నన్ను రమ్మన్నావా?" శివుడి మాటలు ముద్దగా వున్నాయి.

"నీ వరకూ రానిస్తామా గురూ? నేనే లాంగ్‌బెల్ కొట్టేసి క్లాసుల్లోకి వెళ్లి పిల్లల్ని పొమ్మన్నాను. కాన్వెంటు లోపలకు వెళ్లడం యిదే మొదటిసారి. టీచర్సంతా అమ్మాయిలే ఏట ఎట లాడిపోతున్నారు.

"తప్పారే. ఈ రోజు పాడు మాటలు చెప్పకు. దేశం కోసం దీక్షగా బంద్ చేయిస్తున్నామంటే చాలా పవిత్రమైన రోజు ... ఆఁ - నీ సంగతేవిట్రా నాగూ?" సానికి కూడా కొన్ని నియమాలున్నట్టు ఆ రోజు అమ్మాయిల ప్రసక్తి కిట్టని శివుణ్ణి చూసి శిష్యులంతా ఆశ్చర్యపోయారు.

'ఇంటింటికి తిరిగి ఆ నల్లోడు సోడాలమ్మేస్తున్నాడు గురూ. మర్యాదగా చెపితే మానలేదు. ఓ అరడజను సోడా బుడ్లు తీసి పగలగొట్టేసరికి లెంపలేసుకొని బుద్ధిగా బండి తోసుకొని యింటికెళ్లిపోయాడు" చారల బనియనుతో బక్కపల్చగా వున్న నాగులు 'బ్రూస్‌లీ' పోజులో తన సాహసాన్ని వివరించాడు.

"సెభాష్" మెచ్చుకున్నాడు శివుడు.

శివుడి చుట్టూ మూగిన గాంగ్‌లో మరెవరో నోరు విప్పబోయారు. ఇంతలో భుజాన కావిడి వేసుకొని కూరగాయలమ్ముకొంటున్న ఓ ముసలాణ్ణి లాక్కొచ్చి శివుడి ముందు నిలెశాడు రంగడు - హైస్కూలులో చదువుతున్న కుర్రాడు.

"చూడు గురూ, ఈ పోటుగాడు మెల్లగా సందుల్లో యాపారం చేసేస్తున్నాడు". దొంగను పట్టుకొన్న పోలీసులా ఫిర్యాదు చేశాడు రంగడు.

ఎరా, ముసలి నాయాలా - ఏంటి నీ కత?" శివుడి కళ్లు చూసి ముసిలాడు వణికిపోతున్నాడు. బదులు చెప్పలేక తడబడిపోతున్నాడు.

ఈ రోజు బంద్ అని తెలపదా" కావిడి మీద చెయ్యేసి అడిగాడు శివుడు.

"తెలుసు బాబూ. కొనుక్కొచ్చిన కూరగాయలు పాడయి పోతాయని ..."

"మిగతా వాళ్లకు నిమాత్రం తెలివితేటల్లేకే దుకాణాలు మూసేశార్రా ముసలి నా కొడకా! నీలాంటి యెదవలుండబట్టే దేశం యిలా పాడయిపోతోంది. సరే వెంన యెదవ పనికి లెంపలేసుకొని తిన్నగా యింటికి పో"

"సత్తెం బాబయ్యా ... అలాగే పోతాను" ముసిలాడు వెనుతిరిగాడు.

"ఈణ్ణి యిలా వదిలేస్తే యెన్నడో కక్కుర్తిపడతాడు గురూ". అంటూ వెరైటీగా తట్టమీద ఓ తన్ను తన్నాడు రంగడు. కూరగాయలు యెగిరిపడి చెంపరపంపరగా దుమ్ములో కలిసిపోయాయి.

"బాబూ ... బాబూ .." అంటూ ముసలాడు వాటిని ఏరుకోబోతుండగా నాగులు రెండో తట్ట మీద కూడా తన్నాడు. మొత్తం కూరగాయలన్నీ నేలపాలయ్యాయి. ఆ గుంపంతా పగలబడి నవ్వారు. ముసిలాడు ఖాళీ కావిడి భుజం మీద పెట్టుకొని గుడ్ల నీరు కుక్కుకుంటూ కాళ్లీడ్చుకుంటూ కదిలాడు.

ఇంతలో మరో కుర్రాడొచ్చి "అగ్రహారంలో ఓ ఆడమనిషి అరటిపళ్లమ్ముకొంటోంది గురూ" అన్నాడు

ఆడదాన్ని ఆపు చెయ్యలేక వార్త చెప్పడానికొచ్చావురా మొగాడివి? నేను పడ్తాను దాని పని నడు చూపించు' రంగడు హుషారుగా సైకిలెక్కాడు. రంగణ్ణి మరో యిద్దరు కుర్రాళ్లు అనుసరించారు.

విజయపరంపరతో ఒళ్లు తెలియని శివుడు పక్కనే వున్న బ్రాందిషాపులోకి వెళ్లి మరో క్వార్టరు లాగిస్తున్నాడు లాస్ట్ రవుండ్‌లో వున్న శివుడి చెవిలో యేదో చెప్పి నాగులు బయటికు లాక్కెళ్లాడు

ఓ ఒంటెద్దు బండిని. దాని పక్కనే తలపాగ చుట్టుకొన్న బక్క మనిషిని కుర్రాళ్లు నిలబెట్టి గొడవ చేస్తున్నారు. శివుడు రాగానే అంతా దారిచ్చి నిలబడ్డారు.

"బండెక్కడికిరా బక్క లంజా కొడకా?"

"కొలవిధీకండి. ఈ రెండ్రోజులుగా పనిలేక మాడిపోతున్నాం బాబూ. అదురుట్టం కొద్దీ ఆ పంతులుగారొచ్చి పని సెప్పారు. ఈ తలుపు సెక్కలు అక్కడికి సేరిత్తే అయిదు రూపాయలిత్తానన్నారు. బక్కోణ్ణి. నన్ను దయదలసి పోనివ్వండి"

"ఈ రెండ్రోజుల్నుంచి నువ్వు తప్ప మేవంతా తినేసి సుఖపడిపోతున్నామంటావా? నా మట్టుకు నేను వుదయం లేచి తీర్థం తప్ప మరేం తీసుకోలేదు. దేశం కోసం ఈ మాత్రం చెయ్యకపోతే యెందుకురా దొంగ నాయాల్లారా. పో ... వెనక్కు పో"

"బాబూ ... మీ కాళ్లట్టుకొంటా ..." అని

ప్రాధేయపడుతున్న ముసిలాడికి చుట్ట కాల్చుకొంటూ వస్తున్న కానిస్టేబులు గవర్రాజు దేవుడిలా కనిపించాడు. కాని గవర్రాజు వస్తూనే శివుడికి శాల్యూట్ చేసాడు.

"సూడండి పోలీసుబాబూ. నన్నీళ్ళు కదలనియ్యడంలేదు"

"బంద్ కదా తాతా. శివుడిగారికెదురు చెప్పకు. ఆయనకు కోపమొస్తుంది. వెళ్ళు. వెనక్కి పో" అని గవర్రాజు సలహా యిచ్చాడు.

"ఏవిటి గవర్రాజుగారూ. దేశమంతా బందో బందో అంటుంటే మీరు మంచో మందో అని బయల్దేరారు. బందో బస్తు లేదా?" శివుడు మందు నవ్వు చూసి కుందేలయిపోయాడు గవర్రాజు.

"మీకు తెలియనిదేముంది బాబూ? అలవాటుపడిన ప్రాణం. వస్తాను సార్." గవర్రాజు బ్రాంది షాపులో దూరాడు.

శివుడు ముసిలాడికేసి తీక్షణంగా చూశాడు. ఆ చూపు అతణ్ని భస్మం చేసేలా వుంది.

"ఏరా బక్క నా కొడకా. పోలీసాయనకు కంప్లైంట్ చేస్తావురా? నీకెన్ని దమ్ములురా? నీకు నేను చెపుతాను బుద్ధి" తలుపు చెక్క ఒకటి తీసి విష్ణు బొమ్మలు కాలుతున్న మంటల్లోకి విసిరాడు శివుడు. మరొకటి తియ్యబోతుండగా ముసిలాడు అడ్డుపడ్డాడు. శివుడు రెచ్చిపోయి ముసలాడి ఒళ్ళు హూనమయ్యేలా చితక్కొట్టాడు.

"నీ దిక్కున్నచోటికి చెప్పుకోరా" అంటూ చెక్కలన్నీ మంటల్లోకి విసిరేసి, ఎద్దుని విప్పేసి బండి విరిగేలా ఒక్క తన్ను తన్నాడు. కోపం చాలక ముసలాణ్ని కూడా బలంగా తన్నాడు. ఆ తాపుకి వెల్లకిలా పడిన ముసలాడి తల గాంధీ బొమ్మకి తగిలి రక్తం చిమ్మింది. ...

"దాన్ని నోరు మూయించాను గురూ" అంటూ విజయగర్వంతో అప్పుడే సైకిలు మీద వచ్చి వాలిన రంగడు గాంధీ బొమ్మ దగ్గర స్పృహతప్పి పడిపోయిన ముసలాణ్ని చూసి 'తాతా' అంటూ గొల్లుమన్నాడు.

"మా తాత ... రాజులు తాత ... ఊపిరి ఆడుతున్నట్టు లేదు. మా తాతకేం జరిగింది? హాస్పిటలుకు తీసుకెళ్ళాలి" అంటూ ఆదుర్దాపడుతున్నాడు రంగడు. కనుచూపుమేరలో ఏ వాహనం లేదు - విరిగిన ఒంటెద్దు బండి తప్ప! □

